

సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు బండారి వెంకటేష్ కలిశారు. ఇటీవల టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆయన కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి సమావేశమయ్యారు. బండారి వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలలా బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు తమ ముదిరాజ్ కులస్తులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ముదిరాజ్‌లంతా ఏకమై బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ హయాంలోనే తెలంగాణ దేశంలో నంబర్ వన్ స్థానానికి చేరిందన్నారు. **- అబిడ్స్, నవంబర్ 6**

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రోరా పీజీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్, నవంబర్ 6 : ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. అబిడ్స్‌లోని అరోరా పీజీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 2022 గణాంకాల ప్రకారం హెల్మెట్, సీటు బెల్ట్ ధరించని కారణంగా జరిగిన ప్రమాదాలలో రెండు రాష్ట్రాలలో 7535 మంది ప్రాణాలు కోల్పోగా 17,439 మంది గాయాల పాలయ్యారన్నారు. ఈ లెక్కన సగటున రోజుకు 21 మంది మృతి చెందగా 48 మంది గాయపడ్డారని వివరించారు. హెల్మెట్ ధరించని కారణంగా దేశ వ్యాప్తంగా 16,715 మంది ప్రాణాలు పోగొట్టుకోగా అందులో తెలంగాణలో మృతుల సంఖ్య 3.79 శాతం ఉందన్నారు. కార్యక్రమంలో అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పర్దోష్ చంద్ర పట్నాయక్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం



అయ్యప్ప స్వామి మాలాధారులకు అన్నదానం కార్యక్రమం నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ ఇన్‌కంట్యాక్స్ కాలనీలోని రాజరాజేశ్వరి దేవస్థానం ఆలయ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం ప్రారంభించారు. జనవరి 1, 2024 వరకు అన్నదానం కొనసాగుతున్నదని మెహిదీపట్నం శ్రీ అయ్యప్ప స్వామి భక్త సమాజం అధ్యక్షులు అప్పారావు గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్త సేవా సమాజం సభ్యులు కిషన్, సురేందర్ రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, నవంబర్ 6**

# ఆధునిక వసతులతో వసతి గృహం



మాసాబ్ ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ పీజీ సైఫాబాద్ కళాశాల హాస్టల్ భవనం



హాస్టల్‌లో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు

సుల్తాన్‌బజార్, నవంబర్ 6 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేదవాడు ఉన్నతంగా విద్యను అంది పుచ్చుకోవాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నది. ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడుతున్నది. మాసాబ్ ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ పీజీ సైఫాబాద్ కళాశాలలో శిథిలావస్థకు చేరిన విద్యార్థుల వసతి గృహాలను ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి కార్పొరేట్‌కు దీటుగా జీ ప్లస్ – 3 అంతస్తుల భవనాన్ని విశాలంగా నిర్మించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా వసతులు సమకూర్చారు. దాంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేవు. జీ ప్లస్–3 భవనంలో పై అంతస్తులోకి వెళ్లేందుకు రెండు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు .300కు పైగా విద్యార్థులకు వసతి కల్పించేందుకు గాను నిర్మించిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 280కి పైగా విద్యార్థులు ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. అన్ని సదుపాయాలను కల్పించామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్ నాయక్ అన్నారు. పీజీ విద్యార్థినులకు రవాణాకు ఏర్పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కళాశాల ఆవరణలోనే గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

### కార్పొరేట్‌ను తలదన్నేలా..

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దడంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుంది. శిథిలావస్థకు చేరిన హాస్టల్‌ను కోట్ల నిధులను వెచ్చించి అత్యంత విశాలంగా కార్పొరేట్‌ను తలదన్నేలా హాస్టల్ భవనాన్ని నిర్మించారు. ప్రభుత్వ కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతిని కల్పించేందుకు గాను విశాలమైన గదులతో పాటు అన్ని వసతులను కల్పిస్తూ భవన నిర్మాణాన్ని చేపట్టారు. 300కు పైగా విద్యార్థులు ఉండేలా నిర్మాణాలు చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల్లో అత్యాధునిక స్థాయిలో గదులను ఏర్పాటు చేశారు.

### విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం



సైఫాబాద్ సైన్స్ కళాశాల విద్యార్థులకు మెరుగైన శిక్షణతో పాటు మంచి వసతిని కల్పించాం. కార్పొరేట్ స్థాయిలో హాస్టల్ భవనం నిర్మించాం. ప్రస్తుతం నూతన హాస్టల్ భవనం ఏర్పాటైన తర్వాత ఇబ్బందులు లేవు. వసతితో పాటు రుచికరమైన ఆహారం అందించడంతో అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. **- జే లక్ష్మణ్ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్**

### మేం చదువుకున్న సమయంలో కంటే ప్రస్తుతం మెరుగు



సైఫాబాద్ సైన్స్ కళాశాలలోనే నేను చదువుకున్నా. ఆ సమయంలో శిథిలావస్థకుచేరిన హాస్టల్ గదుల్లో ఇబ్బందులు పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో కార్పొరేట్‌ను తలదన్నేలా జీ ప్లస్–3 భవనాన్ని నిర్మించడం ఆనందదాయకం. ప్రస్తుతం హాస్టల్‌లో అన్ని వసతులు ఉండటంతో విద్యార్థుల సంఖ్య 300కు చేరింది. **- డాక్టర్ పల్లాటి నరేశ్, హాస్టల్ వార్డెన్**

## పదేండ్లుగా అభివృద్ధి జరుగలేదు

### సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న గోషామహల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్, మంగళ్‌హాట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్, బీఆర్ఎస్ నాయకులు

అబిడ్స్, నవంబర్ 6 : గోషామహల్ నియోజకవర్గంలో పదేండ్లుగా ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, ఎమ్మెల్యే రాజాసింగ్ శ్రద్ధ తీసుకోలేదని గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ ఆరోపించారు. ఈ విషయమై నియోజకవర్గంలోని ఏ చౌరస్తాలోనైనా కూర్చొని చర్చించేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సవాలు విసిరారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు లోధ్ సమాజ్‌కు చెందిన వారితో కలిసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాజాసింగ్ బస్తీల్లో తిరిగి ప్రజల ఓట్లు పొందిన తర్వాత ధర్మం అంటూ ఐదేండ్లు గడుపుతారని, దీంతో నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఆయనను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో 45వేల వరకు లోధ్ కులస్తులు ఉన్నారని, వారు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా లోధ్ సమాజానికి చెందిన వారిని ప్రకటిస్తే ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థి టి. రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామ గ్రామాన అభివృద్ధి జరుగుతుందని, ఈ అభివృద్ధిని తెలుసుకోలేని రాష్ట్ర, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ సీఎం కేసీఆర్ అభివృద్ధి చేస్తున్నారని ప్రధాని మోదీ ఒప్పుకున్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం గురించి మాట్లాడిన ఆయన నియోజకవర్గంలో ఎన్ని వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయడం జరిగిందో మీ పార్టీ అభ్యర్థి రాజాసింగ్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఆసరా పెన్షన్‌ను అందజేయడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలో ప్రజానికి వచ్చి వెళ్లాలి తప్ప తమ సీఎం విమర్శిస్తే సహించేది లేదన్నారు. భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, లోధ్ సామాజిక నాయకులు శివరాజ్‌సింగ్, నరేష్ సింగ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఓటీటీ రంగంలో అవకాశాలు

ఓటీటీ రంగంలో వాయిస్‌కు విస్తృత అవకాశాలున్నాయని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. వాయిస్ రంగంలో కళాకారులుగా రాణించేందుకు వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సురభి కళాక్షేత్రం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, డీడీఎంఎస్ లిటరసీ హౌస్ సౌజన్యంతో 30 రోజుల పాటు నిర్వహించనున్న వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్–4 సీజన్‌ను మామిడి హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆర్. శంకర్, డీడీఎంఎస్ లిటరసీ హౌస్ డైరెక్టర్ కంచర్ల లక్ష్మి, వాయిస్ అండ్ స్పీచ్ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సురభి రమేశ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పోయెట్ అండ్ స్పీకర్ ఆర్జే స్వాతి, రచయిత జర్నలిస్ట్ శాంతి ఇషాన్, వర్క్‌షాప్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. **- జూబ్లీహిల్స్, నవంబర్ 6**

